# లగ్గాల పెళ్ళిళ్ళ బండారము

రచన :

యలమంచిలి వెంకటప్పయ్య

ప్రచురణ :

గాంధీ సామ్యవాద పుస్తకమాల-14

మధునగర్ : : విజయవాడ-10

ప్రథమ ముద్రణ : సెప్టెంబరు, 1986

ప్రతులు : 2,000

వెల : రు. 2-50

C9280

Sundarayya Vigna…

31765

ముఖచిత్రం : క. పి.

రేఖా చిత్రం : [illegible]

ముద్రణ :

స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు

మాచవరం పోస్టు

విజయవాడ 520 004


# జ్యోతిషం పచ్చి బూటకం

జ్యోతిషం చూడడం, దానినే నమ్ముకొని జీవితం గడపడం కూడా ఒక మానసిక బలహీనతే. అంటే ఒక మానసిక జబ్బే. మానవుని ఆలోచనలతో మానవ జీవితాన్ని సంబంధం లేకుండా చేసి, ఆకాశంలో వందల, వేల, లక్షల, కోట్ల మైళ్లదూరంలో వున్న నక్షత్రాలకీ, గ్రహాలకీ ముడి పెట్టి మనిషిని వల్లమాలిన భయానికో, అర్థంలేని, ప్రయత్న హీనమైన ఆశలకో గురిచేసి [illegible]రిగా, వికారిగా తయారు చేయడమే జ్యోతిషం పని.

ఏది ఏమైనప్పటికీ ప్రజలను మూఢుల్ని చేసి నిర్వీర్యులను చేస్తుంది జ్యోతిషం. ఈనాడు జ్యోతిషం ఎందుకూ పనికి రాలిన కుంటిలైన స్వార్థపరుల చేతివృత్తిగా తయారైనది. ఎంతో మంది ఖగోళ శాస్త్రజ్ఞులు జ్యోతిషం పచ్చి బూటకమని అనేక గ్రంథాలు వ్రాశారు. కాని మనదేశంలో పామరులు మొదలు మేధావుల వరకు ముఖ్యంగా నేటి రాజకీయ నాయకులకు ఈ జ్యోతిషం పిచ్చి మరీ ఎక్కువై పోయింది.

నేడు మన దేశంలో రాజకీయ నాయకులనబడే వారిలో జ్యోతిషం పిచ్చితో పాటు పదవీ వ్యామోహము. ధనకాంక్ష. బూటకపు దైవభక్తి. కుల. మత దురహంకారాలు ఎక్కువగుట వల్లనే నేడు దేశంలో పలుమూలలా అరాచకము. లంచగొండి తనము. హత్యలు. దోపిడీలు. మానభంగాలు. హరిజనుల గిరిజనులను పీడించుట మొదలగు చేటులు నదురూబెదురూ లేకుండా చిందులు త్రొక్కుచున్నాయి. ఈ చేటులను పోగొట్టాలంటే. ముందుగా సామాన్య ప్రజలను తెలివిగలవారినిగా తయారుచేయాలి

—మలమంచిలి వెంకటప్పయ్య



కృష్ణాజిల్లా నాగాయలంక నివాసులు, అభ్యుదయ రైతులు స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కరణవాదులు, మండవ నాగభూషయ్యగారు 1975లో కనుమరుగైపోయిన మరువరాని తమ ఇల్లాలు మండవ నాగరత్నంగారి జ్ఞాపకార్థం ఈ పొత్తమును అచ్చువేయించారు.

యలమంచిలి వెంకటప్పయ్య

1986

1975లో కనుమరుగైపోయిన ఆదర్శ దొడ్డ ఇల్లాలు



మండవ నాగరత్నంగారు

# ముందుమాట

విజ్ఞానశాస్త్రం ప్రపంచ మానవులకు సుఖాన్ని కలిగించే రైళ్లు. మోటారుకార్లు. మోటారు సైకిళ్లు. విమానాలు. స్టీమర్లు. టెలిగ్రామ్. టెలిఫోన్. రేడియో. వీడియోలు. టెలివిజన్. కంప్యూటర్లు. ఉపగ్రహాలు. మరమనుషులు మొదలగువాటిని కనిపెట్టి మానవాళికి ఎనలేని మేలును చేకూర్చుచున్నదన్నమాట నిజమే. కాని. వీటితోపాటు విజ్ఞానశాస్త్రము ప్రపంచ మానవాళి నంతను కొన్ని నిమిషాలలో మసిచేయుగల మిసిలీలు. అటంబాంబులు. నైట్రోజన్ బాంబులు. విషవాయువులు. యుద్ధనౌకలు మొదలగు భయంకరమైన మారణాయుధాలను కూడ నిర్మించుచూ ప్రపంచ మానవాళికి గొప్ప కీడును కూడ కలిగింపనున్నదన్నమాట కూడ నిజమే.

ప్రపంచంలో యీ యుద్ధోన్మాదంతోపాటు. మరొక మూల. మతోన్మాదము కూడ వీరవిహారం చేస్తున్నది. అయితే యుద్ధోన్మాదానికీ. మతోన్మాదానికి మధ్య బోలెడు తేడా కన్పిస్తోంది. యుద్ధం మాటిమాటికీ జరిగేదికాదు. అది ఎన్నో కొన్ని ఏండ్ల కొకసారి మొదలిడుకొని కొన్ని నెలలపాటో. నాలుగైదు ఏండ్లపాటో జరుగుతూ వుంటుంది.

అవి ఎక్కువ కాలంపాటు జరగదు. కాని. మతకలహాలు ప్రపంచంలో ఏదో ఒకమూల నిత్యమూ జరుగుతూనే వుంటున్నాయి.

ఇంతేకాదు. మతోన్మాదము. యుద్ధోన్మాదం కంటే మానవాళికి ఎక్కువ కీడును కల్గిస్తోంది. ప్రపంచంలో ఇంతవరకు రాజ్యాధికారంకోసం జరిగిన యుద్ధాలలో చంపబడిన జన సంఖ్య కంటె ఎక్కువమంది మత కలహాలలో చంపబడ్డారని చరిత్రకారుల అంచనా.

యుద్ధాలను రాజ్యాధినేతలు. సైనికులు ఏ విధంగానైతే నడుపుతున్నారో. అదేవిధంగా మతాధిపతులు. పీఠాధిపతులు. సిద్ధాంతులు. పోపులు. బిషప్పులు. ఫాదరీలు. మౌలవీలు. ముల్లాలు మొదలగువారు మతాలను నడుపుతున్నారు.

యుద్ధాలకు మిసిలీలు. అటంబాంబులు. రాకెట్లు. మందుగుండు సామాను. యుద్ధ నౌకలు మొదలగునవి ఏ విధంగానైతే ఆధారభూతాలో. అదేవిధంగా మతాలకు. మూఢాచారాలు. మూఢ నమ్మకాలు. లగ్నాలు. ఆషాడ మాసాలు. అధిక మాసాలు. శూన్య మాసాలు. కత్తెర్లు. వర్జ్యము. జుట్టు. బొట్టు. కట్టు. 3. 7. 8. 13. 18 మొదలగు అంకెలు ఆధారభూతాలుగా వుపయోగింపబడుతున్నాయి.

మన ఆంధ్ర ప్రాంతంలో ముఖ్యంగా హిందువులలో ఎక్కువమంది లగ్నాన్ని అటంబాంబులాగ భయంకరమైన

విగా భావిస్తున్నారు. సిద్ధాంతిగారు పెట్టిన లగ్నాన్ని తు.చ తప్పకుండా పాటించకపోతే. అనేక అనర్థకాలు అనుభవించవలసి వస్తుందని పామరజనం మొదలు పండితజనం వరకూ భయపడిపోతున్నారు. కాని. సిద్ధాంతిగారు పెట్టిన లగ్నాలను తు.చ. తప్పకుండా పాటించిన అనేకమంది అనేకమైన ఆర్థిక. శారీరక బాధలను అనుభవించుట మనం చూస్తున్నాము.

అందువలన నేను యీ చిన్న పుస్తకములో నాలుగు యుగాలలో జరిగిన లగ్నాల పెళ్ళిళ్ళ వివరాలు సామాన్య ప్రజలకు కూడ తెలిసేలాగున తేటతెలుగు మాటలలో సూటిగా. టూకీగా తెలిపాను. కనుక మంచి పెద్దలు తెలిసిన చదువరులు మెచ్చి స్వార్థపరులైన సిద్ధాంతులు పెట్టే బూటకపు లగ్నాలను లక్ష్యపెట్టక తమకు. పెండ్లి పెద్దలకు నిద్ర. తిండి. రాకపోకలు వగైరాలకు ఏ విధమైన ఇబ్బందిలేని సమయాలలో పెళ్ళిళ్ళు జరుపుకోగలరని ఆశిస్తున్నాను.

మీ

27-2-86 యలమంచిలి వెంకటప్పయ్య

# లగ్గాల పెళ్ళిళ్ళ బండారమం

ఈ నేలమీద కలిమి. బలిమి గల భూస్వాములు. వ్యాపారస్తులు. ఉద్యోగస్తులు. రాజకీయవేత్తలు. మత గురువులు. మత ప్రచారకులు మొదలగువారు కోట్లాది రూపాయలను ఖర్చుపెట్టి అనేక అంతస్తులుగల మేడలను. మధ్యతరగతి ప్రజలు మిద్దెలు. డాబాలు. పెద్ద పెద్ద లోగిళ్ళు. సాంఘికంగానూ. ఆర్థికంగానూ. విద్యలోనూ వెనుకబడిన హరిజన. గిరిజన తదితర బీద జనులు పూరిపాకలు. చుట్టు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు.

నేలమీద మనుషులతోపాటు అనేక రకాల జంతువులు. పిట్టలు. పురుగులు. చెట్లు. ధాన్యాదులు. పండ్ల చెట్లు. కూరగాయ మొక్కలు. పూల మొక్కలు. ఇంకా అనేక రకములైన ఓషధులు. విశాలమైన. లోతైన సముద్రాలు. ఎత్తైన కొండలు. వెడల్పయిన నదులు. సరస్సులు. చెరువులు మొదలగునవి కూడ వుంటున్నాయి.

నేల లోపల అగ్నిపర్వతాలు. బంగారం. వెండి. రాగి. ఇనుము. గాజు మొదలగువాటి ఖనిజ పదార్థాలు. నూనెలు. గ్యాసు. బొగ్గు మొదలగునవి కూడ వుంటున్నాయి. సముద్రాలు. సరస్సులు. నదులు మొదలగువాటిలో అనేక

రకాల చేపలు. ఇతర జంతువులు వుంటున్నాయి. ఈ నేలను 'భూ' లేక 'భూమి' అని సంస్కృత భాషలో అంటారు. ఈ భూలోకంలో ఒకప్పుడు బ్రాహ్మణుని "భూదేవుడు" "భూసురుడు" "భూలోక దేవత" అని భావించి ప్రజలు పూజించేవారట.

# 2

ఈ భూమి గోళీకాయవలె గుండ్రముగా వుంటున్నదట. అందుకని దీనిని "భూగోళము" అనసాగారట. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు కూడ గుండ్రంగానే వున్నాయట. అందువల్లనే వాటిని సూర్యగోళము, చంద్రగోళము అనే పేర్లతో పిలుస్తున్నారు.

ఈ భూగోళము కదులుతున్నట్లుగాని, తిరుగుతున్నట్లుగాని మన కండ్లకు కన్పించటం లేదు. కాని సూర్యుడు, చంద్రుడు మాత్రం తూర్పు దిక్కున నుంచి పడమర దిక్కుకు ప్రయాణిస్తున్నట్లు మన కండ్లకు కన్పిస్తుంది. కాని, నిజానికి సూర్యగోళము ఒకేచోటున కదల కుండా వుంటూ నిమిషానికి 720 మైళ్ల వేగంతో నిత్యమూ గిరగిరా తిరుగుతూ వుంటున్నదట. మన భూగోళం నిమిషానికి 420 మైళ్ళ వేగంతో నిత్యమూ గిరగిరా తిరుగుతూ సూర్యగోళము చుట్టూ తిరుగుతున్నదట. చంద్రగోళము కూడ తాను గిరగిరా తిరుగుతూ సూర్యగోళము చుట్టూ తిరుగుతున్న భూగోళము చుట్టూ తిరుగుతోందట.

సూర్యుని కాంతి భూమిమీద పడుటకు 8 నిమిషాలూ, కొన్ని నక్షత్రాల కాంతి భూమిమీద పడటానికి కొన్ని వందల ఏండ్లు పట్టుచున్నదని విజ్ఞానవేత్తలు పరిశోధించి వక్కాణించారు.

మనతోపాటు జంతువులు. పిట్టలు. పురుగులు. చెట్లు. సముద్రాలు. కొండలు. నదులు. సరస్సులు. మనం కట్టుకొన్న మేడలు. మిద్దెలు. డాబాలు. లోగిళ్లు. పూరి గుడిసెలు. చుట్టు గుడిసెలు మొదలగునవన్నీ నిమిషానికి 420 మైళ్ళ వేగంతో తిరిగే భూగోళం వెంట తిరుగుతున్నాయని విజ్ఞానవేత్తలు అంటున్నారు. కాని. మనలో ఎవరమైనా యీ సత్యాన్ని గుర్తిస్తున్నామా? చాలామంది యీ సంగతి నమ్మరుకూడా.

# 3

మానవులు. జంతువులు. పిట్టలు. పురుగులు వగైరాలలో ఆడ. మగ ఆకారాలు. వేరు వేరు స్వభావాలుగలవి కన్పిస్తున్నాయి. ఇంతేకాదు. కొన్ని చెట్లల్లో కూడ ఆడ. మగ ఆకారాలు కన్పించనప్పటికీ వేరు వేరు స్వభావాలుగలవి వున్నట్లు కన్పిస్తున్నాయి. ఉదాహరణకు తాడిచెట్టు. బొప్పాయి మొదలగువాటిలో ఆడ. మగ స్వభావంగలవి స్పష్టంగా కన్పిస్తున్నాయి. మగ తాడిని "పోతుతాడి" అంటారు. అది కాయలు కాయదు. అలాగే మగబొప్పాయి మొక్క కాయలు కాయదు.

గాలి. నీరు. తిండి. వెలుతురు మొదలగునవి మనుష్యులకువలె జంతువులకు. పిట్టలకు. పురుగులకు. చెట్లకు తప్పక కావలసి యుండును. కాని ఆకలి. దప్పిక. నిద్ర. కామము (బూతు) యీ నాలుగు మాత్రం మనుషులలోవలె జంతువులలోనూ. పిట్టలలోనూ. పురుగులలోనూ కన్పిస్తున్నాయి.

కాని 'పెండ్లి' అనే తంతు మాత్రం కేవలం మానవులలోనే వున్నట్లు కన్పిస్తోంది. కనుక. యీ పెండ్లి పుట్టు పూర్వోత్తరాల కథాకమామిషను గురించి తెలుసుకోటానికి ముందు ఆదికాలంలోని మానవుల జీవిత విధానాలను పరిశీలిద్దాం.

# 4

మరీ పూర్వకాలంలో మానవులు అడవులలోని చెట్లమీదను. కొండ గుహలలోనూ నివసించేవారట. ఆ రోజులలో వారిలో ఒకరితో ఒకరికి ఏమీ పొత్తు ఉండేది కాదట. ఎవరికి వారుగా ఒంటరిగా వుండేవారట. ఆడ మగ పూర్తిగా దిసమొలలతో—మొండిమొలలతో—వుండేవారట. ఆకలి వేసినపుడు వారుఏదేని జంతువును గాని పిట్టను గాని చేపను గాని చంపి దాని పచ్చిమాంసం ఆపాట్టే తినేసేవారట. ఎందుకన వారికి అప్పటికింకా నిప్పు సంగతి తెలియనే తెలియదట.

దప్పిక అయినప్పుడు వారుఏదేని నీటి గుంటలోగాని. వాగులో గాని. ఏటిలో గానితమ చారతోనూ. దోసిలితోనూ.

నోటితోనూ నీరు త్రాగేవారట. ఎందుకని వారికి అప్పటికింకా పాత్రల సంగతి తెలియనే తెలియదట.

కామోద్రేకం (బూతు. జతకట్టాలనే కోరిక) కలిగినపుడు వారు తమ కెదురుగా కన్పించే ఆడవాళ్ళను మగవాళ్ళు. మగవాళ్ళను ఆడవాళ్ళు జతకట్టుతూ వుండేవారట. ఆ రోజులలో కామోద్రేకం కలిగినపుడు వారు వావి-వరుసలు. ఈడూ-జోడూ. వేళా-పాళా. గుణము-రూపము వగైరాలను పాటించేవారు కాదట. ఎందుకని అప్పటికింకా వారిలో కులాలు. మతాలు. లగ్నాలు మొదలైనవి లేనేలేవట. అందుకని తండ్రి-కూతురు. తల్లి-కొడుకు. అన్న-చెల్లెలు. అక్క-తమ్ముడు అనే ఆలోచన కూడా వారికి ఉండేది కాదట. ఈ సంగతులన్నీ అపౌరుషేయాలని (మానవులు చెప్పినవి కావని) చెప్పబడే వేదాలలో విపులంగా వ్రాయబడి వున్నాయి.

## 5

మన తెలుగు బాసలో కామాన్ని 'బూతు' అంటారు. కామోద్రేకం కలిగినపుడు మానవులు. జంతువులు. పిట్టలు. పురుగులు ఆడ మగ తప్పక జత కట్టి తీరుతారు. ఎందుకని కామోద్రేకం ఆకలి. దప్పిక. నిద్ర కంటే కూడా ఎక్కువ బలీయమైనది. అది ప్రకృతి ప్రేరేపించే తప్పనిసరియైన పని. అది ప్రకృతి ధర్మ పరమైనది. దానిని ఎవ్వరూ ఆపలేరు. ఆపకూడదు కూడా. అది జరిగి తీరాలి. అది లేనిది సృష్టిలేదు. దాని ప్రభావము సహజంగానే సామాజిక ధర్మమైన

సెతి కంటేఅధికంగానే ప్రాణుల మీద ముఖ్యంగా మానవుల మీద ఉంటుంది.

పని పాటలు లేని సోమరులైన మేధావులలోనూ. కలిమి గల సోమరులలోనూ కామము హద్దుమీరి వ్యసనంగా (దురలవాటుగా) మారిపోయి అనేక కీడులకు మూలమవు తోంది. ఇంతేకాదు ఆడ మగ జతకట్టినపుడు బిడ్డలు పుట్టుట కూడ ప్రకృతి నియమించే తప్పనిసరియైన పనే. కాని ఆదికాలంనాటి మానవులకు పాపం ఆడ మగ జత కట్టుటవల్లనే ఆడుదానికి పిల్లలు కలుగుతారనే సంగతే తెలియదట. ఏ కాయో. కమ్మో. ఏ గడ్డో-గాదమో తినుట వల్లగాని. గాలిపాటు వల్ల గాని ఆడుదానికి బిడ్డలు పుడతారని అనుకొనేవారట.

మరి కొన్నాళ్ళకు ఆడ మగ తమ జననేంద్రియాలను మాత్రం (ఆడగుజి. మగగుజి. పూకు. చుల్లి) ఆకులతోనూ. ఇంకొంత కాలానికి జంతువుల చర్మాలతోనూ. మరికొంత కాలానికి గొఱ్ఱె బొచ్చుతో తయారైన ఉన్ని గుడ్డలతోనూ కప్పుకొనసాగారట. ఇంతేకాదు వారి తిండి విధానంలో కూడా కొంత మార్పు వచ్చిందట. వారు మాంసము నిప్పు బొగ్గులమీద కాల్చుకుని తినసాగారట. వారు అడవులలోని దావాగ్నిని చూచి రెండు ఎండు పుల్లలను రుద్ది నిప్పును కనిపెట్టారట. అప్పటినుండి మాంసమును నిప్పుమీద కాల్చుకొని తింటూ చలికై నిప్పుమంటను ఉపయోగించుకోసాగారట. ఆ నిప్పుగుండే కొంతకాలానికి అగ్నిగుండము లేక హోమగుండమని పిలువబడసాగిందట.

## 6

కొన్నాళ్ళకు మగవానికి ఇల్లు కట్టుకొని ఒకేచోటున నిలకడగా వుండాలనిపించిందట. అందుకై ఇంటివద్ద నిలకడగా వుండి ఇంటిని (పిల్లా జెల్లాను. గొడ్డూ గోదను) సంబాళించడానికి ఆడుది అన్నిరకాలుగా (బ్రతుకు. పనికి) పనికివస్తుందని యోచించి మగవాడు ఆడుదానిని మాయ మాటలు చెప్పి మోసగించి గాని. ఇష్టపడనపుడు బలవంతంగా ఎత్తుకొనిపోయి తన యింటిలో ఖైదీగా బంధించి వుంచుకొనేవాడట. కాని అప్పుడు కూడ ఆడవాళ్ళకు తమ యిష్టమొచ్చినంత మంది మగవాళ్ళతో తమ యిష్టమొచ్చినపుడు జతకట్టే వీలుండేదట. కాని ఒక్కొక్కప్పుడు ఒక ఆడుదానిని తన యింటిలో వుంచుకొన్న మగవానికంటె ఎక్కువ బలముగల మగవాడు ఆ ఆడుదానిని అతనితో పోరాడి ఎత్తికొనిపోయేవాడట. అందుకని మరికొంత కాలానికి ఒక మగవాని వద్ద వున్న ఆడుదానినిబలవంతంగా మరొక మగవాడు ఎత్తుకొని పోరాదనే కట్టడి ఏర్పడిందట.

## 7

కామానికి పెండ్లికి ఏమాత్రం చుట్టరికం లేదు. కామము (బ్రతు) ప్రకృతి సిద్ధమైన స్వాభావికమైన తప్పనిసరి పని. పెండ్లి మానవులు ముఖ్యంగా మగరాయుళ్ళు తమ సుఖానికై యేర్పాటు చేసుకొన్న అస్వాభావికమైన

కట్టుబాటు. కామము తప్పక జరిగి తీరవలసిన పని. కాని పెండ్లి కట్టుబాటు జరిగినా తొందరలేదు; జరగకపోయినా ముంచుకొనిపోయేదేమి లేదు. కామము సృష్టికి (మానవ సృష్టికి) తోడ్పడుతుంది; పెండ్లి కేవలం మగ మహారాజుల సుఖానికి మాత్రమే తోడ్పడుతుంది. అందుకని మగవాళ్ళు స్వార్థపరులై కేవలం తమ సుఖం కోసమే పెండ్లి విధానాన్ని సంఘంలో ప్రవేశపెట్టి వుంటారనేది పరమ సత్యము.

నేటి పెండ్లి విధానము. ఆడు–మగలను ఒండొరులతో వారి సుఖానికనే నెపంతో (కపటంతో) బంధించే ఒక ఆచారంగా తయారైంది. ఈ ఆచారం కొన్నిచోట్ల సంఘపరంగానూ. కొన్నిచోట్ల మత పరంగానూ. కొన్నిచోట్ల చట్టబద్ధంగానూ వుంటున్నది. కాని ఆదికాలంలోని మానవులలో యీ పెండ్లి ఆచారం లేనేలేదు. కాని కొంతకాలానికి మగవాడు పెండ్లి చేసుకోవాలనుకొన్నప్పుడు. పిల్లలను కన్న ఆడుదానినే ఎన్నుకొనేవాడట. ఎందుకన పిల్లలను కన్న ఆడుదానికి కష్ట-సుఖాలుబాగా తెలిసివుంటాయనియు. ఆమె తనను ఎక్కువ సుఖపెట్టగలదనే నమ్మకంతో మగవాడు పిల్లలను కన్న ఆడుదానినే పెండ్లాడేవాడట. పెండ్లి కాకముందు ఆడుది కన్న పిల్లలను. ఆమె సంపాదించిన డబ్బును. ఆమెతోపాటు ఆమెను పెండ్లాడే మగవాడు సంతోషంగా స్వీకరించేవాడట. ఈ సంగతులన్నీ పవిత్రమైనవని చెప్పబడే వేదాలలో చాల విశదంగా విశదీకరింపబడ్డాయి.

నేడు జరుపబడే మంత్రాల, లగ్నాల పెండ్లిండ్ల సందర్భాలలో యీ భావాలుగల మంత్రాలే చదివి పురోహితులు పెండ్లిండ్లు చేయిస్తున్నారు. ఇటువంటి బూతు మంత్రాలనే, చదువు, ధనము గల పెద్దమనుషులు తమ బిడ్డల పెండ్లిండ్ల సందర్భాలలో కావాలని పట్టుబడుతున్నారు.

పాపం నానాకాలపు చదువులు చదివిన పురోహితులకు పెండ్లి సందర్భంలో చదువబడే సంస్కృత మంత్రాల అర్థం నిజంగా తెలియక పోవచ్చును; కాని మంత్రార్థాలను అర్థమయ్యే మాటలలో తెలియచెప్పిన పిదప కూడ ఆ బూతు మంత్రాలతోనే వారు పెళ్ళిళ్ళు చేస్తూ వుండే. ఆ మంత్రాలను విని చాలామంది విద్యావంతులు సంతోషిస్తున్నారు. ఇంతేకాదు ఆ బూతు మంత్రాలు లేని పెండ్లి పెండ్లే కాదని కూడ వారు వితండవాదం చేస్తున్నారు.

# 8

కొంత కాలానికి మానవ సమాజంలో వర్ణాలు ఏర్పాటయ్యాయుట. ఆ వర్ణాలలో బ్రాహ్మణులు అనే వారు చదువు సంధ్యలలోనూ, క్షత్రియులనబడే వారు భుజబలంలోనూ, మిన్నగా వుండేవారట. అందుకని ఆ రెండు వర్ణాల మగవాళ్ళు పదిమంది మగవాళ్ళతో పోయే (జత కట్టే) ఆడుదానితో జత కట్టుట మంచిది కాదని యెంచి మగవానితో జతకట్టని కన్యలతో జత కట్టటానికై కన్యల కొరకు ఒకరితో నొకరు పోట్లాడుకొనేవారట. అప్పుడు కూడా

ఆడవాళ్ళకు తమ యిష్టమొచ్చినపుడు తమ యిష్టమొచ్చినంత మంది మగవాళ్ళతో జత కట్టే వీలు వుండేదట. ఆరోజులలో ఆ పని అంపతనం కాదట; పైపెచ్చు దానిని పవిత్రమైన అతిథి సత్కారంగా యెంచేవారట.

మరికొంతకాలానికి ఒక మగవాని వద్ద వున్న ఆడుది ఇతర మగవాళ్ళతో జతకట్ట కూడదనే కట్టడిని ఉద్దాలక మహా ముని కొడుకు శ్వేతకేతు మహాముని ఏర్పాటుచేసి ఒక మగవాడు తాను ఉంచుకొన్న ఆడుదానితో జతకట్టి మగ పిల్లలను కనజాలకపోయిన యెడల, అతను ఉంచుకొన్న ఆడుది ఇతర మగవాళ్ళతో జతకట్టి మగ సంతానాన్ని కనుట తప్పు కాదనే కట్టుబాటును కూడ ఏర్పాటు చేశాడట. ఈ సంగతులన్నీ పంచమ (అయిదవ) వేదమని చెప్పబడే మన మహా భారత గ్రంథంలో తేటతెలుగు మాటలలో వ్రాయబడి వున్నాయి.

మరి కొన్నాళ్ళకు ఒక మగవాని అదుపులోవున్న ఆడుది ఆ మగవాడు ఎటువంటివాడైనప్పటికీ, అతడు బ్రతికి వున్నంతకాలమే కాకుండా అతను చనిపోయిన తరువాత కూడ ఇతర మగవాళ్ళతో జతకట్ట కూడదనే కట్టుబాటును దీర్ఘతముడు అనే ఒక గ్రుడ్డి మహర్షి ఏర్పాటు చేశాడట. ఈ కట్టుబాటు వలన ఆడవాళ్ళకు ఇతర మగవాళ్ళతో జత కట్టే అవకాశం లేకుండా పోయిందట. అప్పటినుండి ఆడవాళ్ళను మగరాయుళ్లు చీపురుకట్ట, చాప, చెప్పులు (అప్పడాలకర్ర మొదలగు ప్రాణంలేని వస్తువులతో సమానంగా వాడుకోసాగారట. అంటే మగరాయుళ్లు ఆడువాళ్ళను మను

ష్యులనుగా చూడక వారిని అతి నీచంగాను) చులకనగాను చూడసాగారట. ఇంతేకాకుండా మగవాడు చనిపోతే అతని ఆడుది అతని వెంట స్వర్గానికి వెళ్ళి అక్కడ అతనికి నానారకాల ఊడిగము చేసి అతనిని సుఖపెట్టడానికై బ్రతికి వున్న అతని ఆడుదానిని బలవంతంగా అతని పీనుగమీద పడవేసి కాల్చి చంపేవారట మగరాయుళ్ళు వైదిక పండితమాన్యుల సలహా సంప్రదింపులతో! ఈ క్రూరమైన పనికి ఆనాటి వైదిక వాద స్తపు పండితులు "సహగమనం" (పతి వెంట వెళ్లుట) అనే సంస్కృతపు ముద్దుపేరు పెట్టి సహగమనం చేసిన ఆడుది గొప్ప పతివ్రత యనియు. పుణ్యాత్మురాలనియు వెక్కిమక్కలవలె వేదమంత్రాలతో పొగిడేవారట.

## 9

ఆ రోజులలో బ్రాహ్మణులు. క్షత్రియులు మొదలగు ఆర్యజాతి మగరాయుళ్లు గొప్ప కామాంధులై (భోగలాలసపరులై) ఒక్కొక్కరు అనేకమంది ఆడవాళ్ళను తమ కామసుఖానికై వుంచుకొనేవారట. యాజ్ఞవల్క్య మహామునికి గార్గి. మైత్రేయి అనే పేర్లుగల ఇద్దరు విదుషీమణులుండేవారట. దశరథమహారాజు. ధృతరాష్ట్ర మహారాజు వగైరా ఆర్యజాతి క్షత్రియులు ఆ రోజులలో ఒక్కొక్కరు వేరు వేరు వర్గాలకు చెందిన అనేకమంది ఆడవాళ్ళను తమ కామసుఖానికై వుంచుకొనేవారట.

ఇక ఆర్యజాతి బ్రాహ్మణ పురోహితుల సంగతి చెప్ప నక్కరలేదు: వారు ఇతర వర్గస్థులచేత యజ్ఞాలు చేయించి యజ్ఞాలు పూర్తి అయిన తరువాత యజ్ఞాలు చేసిన యజమానుల నుండి వారి కన్యలను దానరూపంలో పొందేవారట. అందువలన వైదిక యుగంలో (వేదకాలంలో) ఆర్యజాతి బ్రాహ్మణ పురోహితులకు జతకట్టడానికి కావలసినంత మంది ఆర్యజాతి పడుచు ఆడపిల్లలు వుండేవారట. కాని ఆర్యజాతి బ్రాహ్మణ పురోహితులు వారితో తృప్తిచెందక అనార్యజాతి (ద్రావిడ. కిరాత) ఆడవాళ్ళను కూడ తమ కామ సుఖానికై వుంచుకొనేవారట. అందుకని ఆర్యజాతి బ్రాహ్మణ పురోహితులు కనీసం యజ్ఞాలుచేయించే రోజులలోనైనా అనార్య జాతి ఆడవాళ్ళతో జతకట్ట కూడదనే కట్టడి ఏర్పాటు చేయ వలసి వచ్చిందట.

# 10

మరికొంత కాలానికి మగవాడు మగబిడ్డలు లేకుండా చనిపోతే అతడు వుంచుకొన్న ఆడది తన మరిదితోగాని. తన పెనిమిటియొక్క ఏ వారసునితోనైనా జతకట్టి మగపిల్లలను కనవచ్చుననే కట్టడిని రాజర్షి వేణురాజు ప్రవేశపెట్టాడట. ఈ పనిని "నియోగము" అనే వారట. కాని కొంత కాలానికి యీా కట్టడిని మను మహారాజు కలికాలానికి పనికిరాదని రద్దుచేశాడట. మరికొంత కాలానికి తగిన మగవానిని ఎన్నుకొనే పనిని ఆడపిల్లలకు. వారి తండ్రులకు వప్పచెప్ప

బడిందట. అప్పుడు ఆడపిల్లల తండ్రులు తమ ప్రాంతంలో గల యువకులను ఒకచోట సమావేశపరచేవారట. ఆ సమావేశాలను "స్వయంవర సభలు" అనేవారట. ఆ స్వయంవర సభలకు వచ్చిన యువకులలో ఆడపిల్లలు తమకు నచ్చిన వారిని ఎన్నుకొని పెండ్లిండ్లు చేసుకొనేవారట. కాని యీ స్వయంవర సభల సందర్భాలలో కూడ ఒక్కొక్కప్పుడు ఆడపిల్లల కోసం కొంతమంది యువకులు పోరులు సలిపి ఆడపిల్లలను బలవంతంగా ఎత్తుకొనిపోయి పెండ్లిండ్లు చేసుకొనేవారట. శ్రీకృష్ణ భగవానులు రుక్మిణీదేవిని యీ విధంగానే ఆమె సోదరులతోనూ. బంధువులతోనూ ఘోరంగా పోరాడి ఎత్తుకొనిపోయి పెండ్లాడాడని అంటారు. ఆ కాలంలో సంఘంలో ఆడవాళ్ళకు ఏ రకమైన స్వేచ్ఛ వుండేదికాదట. కాని బుద్ధ భగవానుని కాలంలో ఆడవాళ్ళకు సంఘంలో మరల కాస్త స్వేచ్ఛ దొరికిందట. కాని బౌద్ధమతంతోపాటు ఆడవాళ్ళ స్వేచ్ఛ కూడ అంతరించిపోయిందట.

మరికొంత కాలానికి మహమ్మదీయుల పరిపాలనా కాలంలో ఆడపిల్లలకు చిన్న యీడులోనే పెళ్ళిళ్ళు చేయబడేవట. పెళ్ళయిన చిన్నపిల్ల పెనిమిటి చనిపోతే ఆ పిల్లకు మరల పెండ్లిచేయుట గొప్ప పాపమని చాదస్తపు వైదిక పండితులు చెప్పి బాల వితంతువులకు కూడ మరల పెళ్ళిళ్ళను చేయనిచ్చేవారుకాదట. కాని మరికొంతకాలానికి కొంతమంది నిస్వార్థపరులైన సంఘ సంస్కర్తలు సాహసించి చాదస్తపు వైదిక పండితులను ఎదిరించి బాల వితంతువులకు పెళ్ళిళ్ళు చేయసాగారట. వారిని చాదస్తపు వైదిక పండితులు అనేక కష్టాలకు గురిచేశారట.

తరువాత బ్రిటిషు వారి పరిపాలనా కాలంలో క్రూర మైన సహగమన దురాచారము రాజారామమోహన్‌రాయ్ గారి కృషివల్ల పూర్తిగా నిర్మూలింపబడిందట. ఇంతేకాక బాల వితంతువులకు మరల పెళ్ళిళ్లు చేయడానికి బ్రిటిషు పరిపాలకులు ఎంతో తోడ్పడినారట.

## 11

ఇక మనం ఇప్పుడు పూర్వకాలంలో ఆర్యులలో జరిగిన పెళ్ళిళ్ల బోగట్టాను గురించి పరిశీలిద్దాం. ఆ రోజులలో ఆర్యులనబడే బ్రాహ్మణ. క్షత్రియ. వైశ్యులలో ఎనిమిది రకాల పెళ్లిళ్లు జరిగేవట –

1. రాక్షస పెండ్లి – ఈ పెండ్లి సందర్భంలో ఒక ఆడుదాని కోసం పదుగురు మగవాళ్లు తమలో తాము పోట్లాడు కొనేవారట. చివరకు అందరికంటె ఎక్కువ బలముగలవాడు ఆ ఆడుదానిని ఎత్తుకొనిపోయేవాడట.

2. పైశాచిక పెండ్లి – ఈ పెండ్లి సందర్భంలో నిద్ర పోతున్న ఆడుదానిని మగవాడు చడీచప్పుడు లేకుండా ఎత్తు కొనిపోయి పెండ్లి చేసుకొనేవాడట. కొన్ని సందర్భాలలో కామాంధురాలైన (జతకట్టాలనే కోరిక గల) కన్యను మగ వాడు మాయ మాటలు చెప్పి తీసికొనిపోయి పెండ్లి చేసు కొనేవాడట.

3. అసుర పెండ్లి - ఈ పెండ్లి సందర్భంలో మగవాడు కన్య తల్లి-దండ్రులకు కొంత డబ్బిచ్చి కన్యను కొనుక్కొని తీసుకొనిపోయి పెండ్లి చేసుకొనేవాడట.

4. ఆర్ష పెండ్లి- ఈ పెండ్లి సందర్భంలో కన్య తండ్రి మగవాని వద్దనుండి కన్యాశుల్కం (కన్య కొరకు యిచ్చే డబ్బు) క్రింద రెండు యెడ్లను తీసికొని తన కుమార్తెను ఆ మగవానికి వప్పచెప్పేవాడట.

5. ప్రజాపత్య పెండ్లి - ఈ పెండ్లి సందర్భంలో కన్య తండ్రి తనకు అల్లుడు కాబోయే మగవానిచేతనూ తన కుమార్తె చేతనూ "మే మిద్దరము కలిసి మెలిసి వుంటూ ప్రేమతో కాపురము చేసుకొంటాము" అని ప్రమాణం చేయించేవాడట.

6 - దైవపెండ్లి - ఈ పెండ్లి సందర్భంలో యజ్ఞం చేయించే పురోహిత బ్రాహ్మణునికి యజ్ఞంచేసిన యజమాని పెండ్లికాని తన కుమార్తెను దానంగా యిచ్చేవాడట.

7 - గాంధర్వ పెండ్లి - ఈ పెండ్లి సందర్భంలో పెండ్లికూతురు. పెండ్లికొడుకు యిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకొని ఒక ఇంటివారయ్యేవారట.

8 - బ్రహ్మపెండ్లి - ఈ పెండ్లి సందర్భంలో యజుర్వేదంలోని ఒక మంత్రంతోనూ. ఋగ్వేదంలోని రెండు మంత్రాలతోనూ పెండ్లి జరుపబడేదట. నేడు కూడ యీ మూడు మంత్రాలతోనే పెండ్లిండ్లు జరుగుతున్నాయట. యజుర్వేదంలోని మంత్రార్థంలో పెండ్లికూతురు తండ్రి

పెండ్లికుమారునితో యిలా అంటాడు - "ఓ అబ్బాయీ! మా అమ్మాయి భయంకరమైన చూపులు గలదికాదు. ఆమె ఇంతవరకు తన సోదరులనుగాని, పెనిమిటినిగాని, బిడ్డలనుగాని చంపి యెరుగదు."

ఋగ్వేదంలోని 10 వ మండలలోని 40.41 మంత్రాలు కూడ అనాదేగాకుండా యీనాటి పెండ్లిండ్ల సందర్భంలో కూడ చదువబడుతున్నాయి. ఈ పద్ధతిని వేదోక్తమని కూడ అంటారు. ఆ మంత్రాల అర్థంకూడ పరిశీలిద్దాం. పురోహితుడు పెండ్లి కుమారునితో యిలా అంటాడు -

"ఓ అబ్బాయీ! యీ పెండ్లి కూమార్తెను కొంత కాలంపాటు సోముడు. కొంతకాలంపాటు విశ్వావసుడనే గంధర్వుడు. మరికొంత కాలంపాటు అగ్నిదేవుడు తమ వద్ద అట్టిపెట్టుకొని యీమెతో సుఖించి జతకట్టి పిల్లలను కని. ఇప్పుడు వారు. ఇక్కడ పెండ్లిపీటమీదకూర్చున్న పెండ్లికుమారుడవైన నీకు. యీ అమ్మాయినీ, కొంత డబ్బునూ. తమకు యీమె ద్వారా కలిగిన బిడ్డలను అప్పగిస్తున్నారు. కనుక నీవు యీమెను. డబ్బును.పిల్లలను సంతోషంతో స్వీకరింపుము."

ఇటువంటి మంత్రాలతోనే నేడు కూడ పెండ్లిండ్లను పురోహితులు చేయిస్తున్నారని లోగడ చెప్పాము. ఇటువంటి బూతు మంత్రాలతో పెండ్లిండ్లు చేయబడుతున్నాయంటే మనం సిగ్గుపడాలో, విచారపడాలో ఆలోచించుకోవాలి. వివేకం గల వారంతాయిటు వంటి పెండ్లి విధానము సదాచారమో! అనాచారమో? శ్లీలమో (ఒప్పో?) అశ్లీలమో ? (బూతో) కాస్త ఆలోచించుకోవాలని మనవి చేస్తున్నాను.

# 12

ఇప్పుడిక ఇటీవల కాలంలో జరుపబడుతున్న రకరకాల పెండ్లిండ్ల విధానాలను గురించి మనం తెలిసికొందాం. మన ఆంధ్ర ప్రాంతంలో బ్రహ్మ సమాజము. ఆర్య సమాజము. దివ్యజ్ఞాన సమాజము. మొదలగు సంస్థల ద్వారా మంత్రాలతోనే పెండ్లిండ్లుజరుపబడసాగెను. కానికమ్యూనిస్టు. కాంగ్రెసు మొదలగు కొన్ని సంస్థల ద్వారా పూల దండలతోనూ. నూలుదండలతోనూ. కూరగాయ ముక్కల దండలతోనూ. రిజిష్ట్రేషన్ ద్వారానూ. తెలుగుమాటలలో పెండ్లిండ్లు జరుపబడుతున్నాయి. ఈ రకపు పెండ్లిండ్లు చాల నిరాడంబరంగానూ. తక్కువ ఖర్చుతోనూ. అందరకూ అనుకూలమైన సమయాలలో తేట తెలుగు మాటలతో జరుపబడుతున్నాయి. కాని మంత్రాలతో జరుపబడే పెండ్లిండ్లు ఎక్కువ భాగం ఆర్భాటాలతోనూ. ఆడంబరాలతోనూ. మేళతాళాలతోనూ. అమితమైన దూబరా ఖర్చులతోనూ జరుపబడటమే కాకుండా. అవి జరుపబడే వేళలు (లగ్గాలు) ఎంతో అసౌకర్యంగానూ. ఆయాసంతోనూ కూడుకొని వుంటున్నాయి.అందువల్ల పెండ్లి పెద్దలు. మేళతాళాల వారు అందరూ ఎన్నో శారీరక. ఆర్థిక ఇబ్బందులకు గురి కావలసివస్తోంది.

ఇక మంత్రాలతో చేయబడే పెండ్లిండ్ల వేళలను అంటే లగ్గాలను గురించి మనం పరిశీలిద్దాం.లగ్గాలను నిశ్చయించే వారిలో ఎక్కువమంది జాపనయ్యాలే. ఇది వారికిమంచి లాభ

34765

సాటి వృత్తిగా వుంటున్నది. దీనివల్ల మితిమీరిన ఆదాయం వస్తుంది.

లగ్నాలను నిశ్చయించే వారిని సిద్ధాంతులు. దైవజ్ఞులు. జోశ్యతిష్కులు అని అంటారు. పామరులు మొదలు పండితుల వరకు సిద్ధాంతిగారు పెట్టిన లగ్నాన్ని తు. చ. తప్పకుండా పాటిస్తారు. ఎందుకన లగ్నాన్ని పాటించకపోతే గొప్ప కీడు సంభవింపగలదని సిద్ధాంతిగారు ముందుగానే బెదరేస్తారు. అందువలన కలిమిగలవారు కలిమిలేని పేదలు అందరూ సిద్ధాంతిగారు పెట్టిన లగ్నాన్ని ఎన్ని కష్టాలు సంభవించినా పాటించటానికి శాయశక్తులయత్నిస్తారు.

కాని మానవులకు కలిగే కీడులను పోగొట్టటానికి నిజంగా సిద్ధాంతిగారు పెట్టిన లగ్నాలలో శక్తివుంటే, సిద్ధాంతిగారు పెట్టిన లగ్నాలలో పెండ్లిండ్లు చేసికొన్న ఎంతో మంది అమ్మాయిలు ఎందుకు ముండమోస్తున్నారు? లగ్నాలలోనే కీడును పోగొట్టే శక్తి వుంటే సిద్ధాంతుల అమ్మాయిలు కూడ తమతండ్రులు పెట్టే లగ్నాలలో పెండ్లిండ్లు చేసికొని ఎందుకు ముండమోసురు? వట్టిదే. లగ్నాలలో కీడును తొలగించగల శక్తిలేనేలేదు. లగ్నాలు బూటకాలే. సిద్ధాంతులు వేరే వృత్తిని చేయలేక తమ డొక్కలను నింపుకొటానికి పన్నిన పన్నాగమే లగ్న నిశ్చయము. ఇప్పుడిప్పుడే యీ బూటకాన్ని కొంతమంది ప్రజలు తెలిసికోగలుతున్నారు. కాని వారు సంఘానికి బెదరి లగ్నాన్ని పాటించినట్లు నటిస్తున్నారు. అట్లనే చచ్చిపోయిన వారికి దినం చేయుట కూడ బూటకమేనని ఎక్కువమంది గ్రహించి కూడ సంఘానికి వెరచి

నామమాత్రంగా దినం చేయుచున్నారు. మరొక వృత్తిని చేయలేక పురోహితులు వచ్చినంత వరకే చాలునని ఇచ్చిన దానితోనే తృప్తిపడుచున్నారు. కనుక లగ్నాల. దినాల తంతులను పాటించకపోతే జనం ఎన్నో కష్టాలను తప్పించుకోవచ్చునని మనవి చేస్తున్నాను.

## 13

ఇక మనం ఇప్పుడు సిద్ధాంతులు పెట్టే లగ్నాలలో నిజంగా కీడును తొలగించగలిగే శక్తి వుందో లేదో ప్రత్యక్షంగా పరిశీలిద్దాం. అందుకై ముందుగా కృత. త్రేతా. ద్వాపర యుగాలలో జరిగిన లగ్నాల పెండ్లిండ్లను గురించి పరిశీలించిన తరువాత కలియుగంలో జరుగుతున్న పెండ్లిండ్ల లగ్నాలను గురించి పరిశీలిద్దాం.

కృత యుగంలో సత్యహరిశ్చంద్ర మహారాజు చంద్రమతీదేవి పెళ్ళి లగ్నంలో కీడును తొలగించే శక్తి వుండి వుంటే పాపం హరిశ్చంద్ర మహారాజు వల్లకాడులో కాపలా వాడునాడా. చంద్రమతీదేవి ఒక బ్రాహ్మణ కొంపలో పని కత్తెగానూ ఎందుకు వుండవలసి వచ్చేది ?

త్రేతా యుగంలో సీతా రాముల పెళ్ళి లగ్నంలో శక్తి గనుక వుండివుంటే. వారు పదునాలుగు యేండ్లపాటు కారడవులలో పూరి గుడిసెలో వుంటూ బొగ్గుల నిప్పు మీద జింక. పందేలు వగైరా నిరపాయకరమైన జంతువులను

చంపి వాటి మాంసపు ముక్కలను కాల్చుకొని తింటూ అనేక ఆపదలను ఎందుకు అనుభవించేవారు ?

రామునిపట్టాభిషేక లగ్నంలో శక్తి గనుక వుండివుంటే లక్ష్మణుడు పాపం పదునాలుగేండ్లపాటు నిద్ర. పెండ్లాము లేకుండా సీతారాముల పూరిగుడిసెకు రాత్రింబవళ్ళు ఎందుకు కావలి కాసేవాడు ?

పాపం లక్ష్మణుని ఇల్లాలు ఊర్మిళాదేవి పెనిమిటి ఎడబాటు దుఃఖంలో పదునాలుగేండ్లపాటు కూడు. నీళ్లు లేకుండా ఎందుకు నిద్రపోయేది ? నిజంగా అవతారమూర్తియైన శ్రీరామచంద్రుని పట్టాభిషేకలగ్నంలో శక్తి గనుక వుండి వుంటే పాపం భరతుడు అకారణంగా తల్లినితిట్టి. కొట్టి తాను పదునాలుగేండ్లపాటు అన్నగారి కొయ్య పాముకోళ్లకు పూజ చేస్తూ రాజ భోగాలను విడిచిపెట్టి సన్యాసిగా ఎందుకు జీవితం గడిపేవాడు ?

ద్వాపర యుగంలో నలమహారాజు. దమయంతీదేవి పెళ్ళి లగ్నంలో శక్తి గనుక వుండివుంటే. వారిద్దరూ అడవుల పాలై పోయి చాలీ చాలని గుడ్డలు కట్టుకొని కడుపునిండా కూడులేక దారీతెన్నూ తోచక ఆ అడవులలో చెట్ల క్రింద రాతిబండల మీద నిద్రిస్తూ తిరుగుతూ చివరకు ఒక రోజున నిద్రిస్తున్న దమయంతిని విడిచిపెట్టినలమహారాజు అయోధ్య చేరి ఋతుపర్ణమహారాజువద్ద బాహుకుడు అనేపేరు పెట్టుకొని రథసారథిగా ఎందుకువుండేవాడు? దమయంతీదేవి పాపంగతి లేక తుదకు తండ్రి పంచకు ఎందుకు చేరవలసి వచ్చేది ?

ద్రౌపది - పంచపాండవుల పెళ్ళిలగ్గంలో శక్తి గనుక వుండివుంటే, వారుఅజ్ఞాతవాసానికి ఎందుకువెళ్ళవలసివచ్చేది? కారడవులలో చెట్ల క్రింద కాపురం చేస్తూ అనేక ఇడుము లకు ఎందుకు గురైయ్యేవారు ? చివరకు విరాట్ మహారాజు కొలువులో వారు తలా ఒక చాకిరీ ఎందుకు చేసేవారు ? భీముడంతటి పరాక్రమశాలి వంటవాడుగా ఎందుకుండే వాడు ? ద్రౌపది పాపం విరాట్ మహారాజు అంతఃపురంలో పనికత్తెగా ఎందుకు వుండివుండేది ? అర్జునుడు ఆడవేషంలో బృహన్నల అనే పేరు పెట్టుకొని విరాట్ మహారాజు కూతురు ఉత్తరకు గాన విద్య ఎందుకు నేర్పవలసి వచ్చేది ?

# 14

ఏ మహర్షి అన్ని యుగాలలోనూ కొన్ని లక్షల యేండ్లపాటు బ్రతికియుండి శ్రీరామునకు పౌరోహిత్యము చేస్తూ నీచ జాతికి చెందిన అరుంధతి, అక్షమాల అనే ఆడ వాళ్ళను పెండ్లి చేసికొనివారి ద్వారా వందమంది పుత్రులను కన్నాడో, ఏ మహర్షి యొక్క ఒక హుంకారము బ్రహర్షి యైన విశ్వామిత్రుని వందమంది కుమారులను మసి చేసి వేసెనో, అట్టి వసిష్ఠ మహర్షిని దేవతల వేశ్యయైన ఊర్వశి ఏ జ్యోతిష్క సిద్ధాంతిగారి చేత లగ్గం పెట్టించుకొని మిత్ర, వరుణులతో జతకట్టి కన్నది ?

ఏ మహానీయుని వరప్రభావము చేపల కంపుకొట్టే శరీరము గల మత్స్యగంధి అనే ఒక పల్లెపడుచును యోజ

నగంధిగా (ఆమడ దూరం వరకు సువాసన కొట్టునట్టిదిగా) మార్చివేసిందో. ఏమహాముని తపశ్శక్తిపగటిని పొగమంచుతో కప్పివేసి చీకటి గల దానినిగా చేయగలిగెనో. ఏ మహాముని తన తపశ్శక్తితో మత్స్యగంధి కన్యాత్వమును చెడకుండా కాపాడగలిగిందో. ఏమహాముని మాదిగ జాతి ఆడదాని కడుపున పుట్టెనో. అట్టిపరాశరమహామునితో పట్టపగలే అనేక మంది మునుల యెదుట మత్స్యగంధి ఏ జోతిష్కసిద్ధాంతి గారిచేత లగ్గం పెట్టించుకొని జతకట్టి. పుడుతూనే గడ్డాలు. మీసాలు. దంతాలు గల. నాలుగు వేదాలను సరిదిద్దగల. మహా భారతము. భాగవతము. భగవద్గీత మొదలగు పవిత్ర గ్రంథాలను రచింపగలిగిన వేదవ్యాస మహామునిని కన్నదీ?

దేవతల వేశ్యయైన మేనకకు. బ్రహ్మర్షి విశ్వామిత్రునికి పుట్టిన శకుంతల. వేట కొరకు వెళ్లిన దుష్యంత మహారాజు యిద్దరూ ఏ జోతిష్క సిద్ధాంతిగారి చేత లగ్గం పెట్టించుకొని కణ్వమహర్షి ఆశ్రమంలో లేని సమయంలో గంధర్వ పెండ్లి చేసికొని భరతుని వంటి తేజోవంతుడైన చక్రవర్తిని కన్నారు ?

## 15

మన ఆంధ్ర ప్రాంతంలో పనికిరానివి. కీడును కలిగేవనుకొనబడే తిథులలో - ఆషాఢమాసం. అధిక మాసాలలోనూ. కర్తెర్లలోనూ- మన ఇరుగు పొరుగు ప్రాంతాలలోని వారు శుభకార్యాలను చేసుకొన్నవారు కోకొల్లలుగా

వున్నారు. మోహన్‌దాసు కరమ్‌చంద్ గాంధీ (బాపూజీ)
గోఖలే. తిలక్. లజపతిరాయ్. మోతీలాల్ నెహ్రూ. మదన్
మోహన్ మాలవ్యా. బాబూ భగవాన్‌దాస్. పురుషోత్తమ
దాస్ టాండన్. వల్లభభాయి పటేల్. రాజేంద్రప్రసాద్.
చిత్తరంజన్‌దాస్. శరశ్చంద్రబోస్. వీర సావర్కార్.
రవీంద్రనాధ్‌టాగూరు. జవాహర్‌లాల్‌నెహ్రూ. లాల్‌బహదూర్
శాస్త్రి. జయప్రకాశనారాయణ్. నరేంద్రదేవ్. ప్రేమచంద్.
సంపూర్ణానంద్. సర్దార్ పృధ్వీసింగ్. రామమనోహర్‌లో
హియా. రాజగోపాలచారి. విశ్వేశ్వరఅయ్యర్. సి.వి. రామన్
అన్నాదొరై. శ్రీనివాసశాస్త్రి. సత్యమూర్తి. సి. వి. రామ
స్వామినాయకర్. డాక్టర్ నాయర్. అంబేద్కర్. మొదలగు
వారు మనకు (ఆంధ్రులకు) పనికిరాని కీడును కలిగించే
లగ్గాలలో పెండ్లిండ్లు చేసుకొని గొప్ప మేధావులుగానూ.
ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులుగానూ.
దేశ భక్తులుగానూ, రాష్ట్ర నిర్మాతలుగానూ.
రాజ్య పరిపాలనాదక్షులుగానూ. గొప్ప వక్తలుగానూ.
గొప్ప కవులుగానూ, గొప్ప నాయకులుగానూ. గొప్ప
తత్త్వవేత్తలుగానూ. గొప్ప విద్వాంసులుగానూ. గొప్ప
విజ్ఞానవేత్తలుగానూ గొప్ప పేరు పొందలేదా ?

ఇంతేకాదు. అమెరికా, ఐరోపా. ఆస్ట్రేలియా. ఆఫ్రికా
మొదలైన ఖండములలో నివసించేవారు. మన ఆసియా
ఖండంలోని యితర దేశస్థులు మన శూన్యమాసాలను, అధిక
మాసాలను. ఆషాఢ మాసాలను, అమావాస్యలను. మూఢా

లను. కత్తెర్లను. వర్జాలను పాటించక పెళ్ళిళ్లు మొదలైన శుభకార్యాలు చేసికొంటూ సుఖ జీవనం చేస్తూ దీర్ఘకాలం పాటు జీవించుట లేదా ?

# 16

లోకానుభవాన్ని పట్టిచూడగా, లగ్న నిర్ణయం అనేది మన ప్రాంతంలో పనికి దొంగలైన కొంతమంది మేధావులు తమ బుక్తికొరకు ముఖ్యంగా పామర జనాన్ని ఆర్థికంగా దోచుకోటానికి పన్నిన ఒక పెనుపన్నాగముగా కన్పిస్తోంది.

ఎందుకనగా ప్రపంచ మానవులందరకు చావు - పుట్టు కలు సమానంగానే వుంటున్నాయి. అయినప్పుడు లగ్నం యొక్క మంచి చెడ్డ ప్రభావాలు కూడా మానవులందరి మీదా సమానంగా వుండాలి కదా ? మన ప్రాంతంలోని మానవులకు కీడును కలిగించేవిగా యెంచబడే అధికమాసము. ఆషాడ మాసము. శూన్యమాసము. మూఢము. కత్తెర వగైరాలలో ప్రపంచంలోని అమెరికా. ఐరోపా. ఆఫ్రికా మొదలైన ఖండాలలోని దేశాలవారూ. మన దేశంలోని కొన్ని యితర ప్రాంతీయులు శుభకార్యాలను చేసుకొంటూవున్నారు: కాని వారికి ఎలాంటి కీడు కలుగుటలేదెందుకని ? ఇంతేకాదు మన ప్రాంతంలో లగ్గాన్ని తు. చ. తప్పకుండా అమలు పరచిన అనేకమంది ఎన్నో ఇడుమలపాలై పోయిరి. లగ్నంలో నిజంగా కీడును తొలగించ గల శక్తి గనుక వుండి వుంటే, పాపం లగ్గాలను తు. చ. తప్పకుండా పాటించిన

వారెందుకు కష్టాలకు గురైయ్యేవారు ? పట్టిదే. లగ్న నిర్ణయం అనేది పచ్చిమోసమే. పని పాటలు చేయలేని, చేయుట తప్పు అని భావించే కొంత మంది సోమరులైన మేధావులు తమ తోలు డొక్కల కోసం అమాయకులను ఆర్థికంగానూ బౌద్ధికంగానూ దివాలా తీయించడానికే యీ లగ్నాల తంతును సాగిస్తున్నారు. సిద్ధాంతిగారు నిర్ణయించిన అర్థరాత్రి వేళల లగ్నాలను తు. చ. తప్పకుండా పాటించటానికై అమాయకులే కాకుండా. మేధావులనుకొనబడే వారు కూడ అనేక ఆర్థిక. శారీరక కష్టాలను అనుభవిస్తున్నారు.

నిజానికి మనకు రాజకీయ స్వాతంత్ర్యము వచ్చిన తరువాతనే మనదేశంలో ముఖ్యంగా హిందువులనబడేవారిలో అందులో ఎక్కువ మంది చదువు - సంధ్యలు గల వారిలోనే మతపిచ్చి. కులపిచ్చి. లగ్నాలపిచ్చి. డబ్బుపిచ్చి. దేవునిపిచ్చి ఎక్కువై పోయాయి. అన్నిపిచ్చులలోనూ లగ్నాల పిచ్చి కేవలం జ్యోతిష్యం మీద ఆధారపడి వుంది. జ్యోతిష్యం అంటే పామరులు మొదలు మేధావుల వరకు ఎంత ఆస్తకో అంతభయం కూడ వుంది. అందువలన సిద్ధాంతిగారు పెట్టిన లగ్నాన్ని తు. చ. తప్పకుండా పాటించేవారు అనేక ఆర్థిక శారీరక ఇబ్బందులకు గురికావలసివస్తోంది. కనుక లగ్నాల తంతును తిరస్కరించి పెళ్ళిళ్ళు మొదలగు కార్యాలను ఎవ్వరికీ కూడా తిండికి. నిద్రకు. రాకపోకలకు యిబ్బంది లేని సమయాలలో జరుపుకొనుట వల్ల ఎన్నోయిబ్బందుల నుండి మనం తప్పించుకో వచ్చునని మనవి చేస్తున్నాను.

ఇప్పుడిక పెండ్లిగురించి గురించి నేను టూకీగా మనవి చేస్తాను. మంచి నడత. ఈడు. ఒడలు గల ఒక అమ్మాయి. ఒక అబ్బాయి. యిద్దరూ అరమరిక. ముడికి లేని గుండెలతో ఒకరికొకరు చేదోడు. వాదోడుగా వుంటూ. ఎడతెగని నెమ్మికతో కాపురం చేసుకొంటూ ఆరాటంలేని తెలుగున ఆర్జింనడబ్బుతో తనివి చెందుతూ. ఎన్నో ఇబ్బం దులు పడి తమను కని పెంచి పెద్దవాళ్ళనుగా చేసిన తమ తల్లిదండ్రులకూ. తమకు కావలసిన జీవితావసర వస్తువులను- తిండి. గుడ్డ. గూడువగైరాలను - సకాలానికి అందిస్తూ తమ చుట్టు ప్రక్కల నివసిస్తూవుంటున్న తోటి మానవులకూ తమ వీలును బట్టి తగిన చేయూతనిస్తూ. తమ మానవ విత్త నాన్ని ఇంకా పదికాలాలపాటు పదిలంగా వుంచటానికై ఇద్దరు ముగ్గురు బిడ్డలను కని. పెంచి పెద్ద వాళ్ళనుచేయాలి. అందుకైవారిద్దరూ పదిమంది పెద్దల యెదుట ముడికి లేని గుండెలతో తాము ఇద్దరూ కలిసి మెలసి కాపురం చేసు కొంటామని ఒక ఒడంబడిక చేసుకోవాలి. అట్టి ఒడంబడికనే "పెండ్లి" అని అంటారు.

పెండ్లి ప్రమాణాలు :

పెండ్లి కొడుకు — ఓ.........!

మన మిద్దరము మన కుటుంబాలకు. మన సంఘానికి. మన దేశానికి, సర్వమానవాళికి మన వీలునుబట్టి సహాయంచేస్తూ. పరిమితమైన సంతానాన్ని. పోషణకుతగిన ధనాన్ని. మంచి ఆరోగ్యాన్ని పొదంటానికై ఇప్పుడు నేను

నిన్ను నాకుతోడుగావుంచుకొంటున్నానని యీపెద్దలయెదుట ఒప్పుకుంటున్నాను.

పెండ్లికూతురు - ఓ ........ గారూ !

మన మిద్దరము కలిసిమన కుటుంబాలకు. మనసంఘానికి. మన దేశానికి. సర్వమానవ జాతికి మన వీలును బట్టి సహాయం చేస్తూ పరిమిత సంతానాన్ని. ఉచిత ధనార్జనాన్ని. మంచి ఆరోగ్యాన్ని పొందటానికై ఇప్పుడు నేను మిమ్ములను నాకు తోడుగా. వుంచుకొంటున్నానని యీ పెద్దల ఎదుట నిండుగుండెతో ఒప్పుకొంటున్నాను.

...Vignana Ke...
...rary
34765